# పంచాంగప్రసక్తి

ప్రేగంటమున కేసు పిన్న బాలిక వాలుజడలో మల్లెపూవు కనిపించినప్పుడు, శీతోదక స్నానజాత సౌఖ్యముపైన ముకుపుటాన చెమర్పు పుటినప్పుడు, ఒకదినాన పికాలాపం దూరపు కోననుండి వినవచ్చినప్పుడు వసంత మరుగుదెంచెనను మధురోహ తమకు స్ఫురించినట్టుగా సెలవిచ్చారు కవిగారు.

అణువునుంచీ బ్రహ్మాండం వరకూ చరాచరాలన్నింటిలోనూ అందాన్ని తిలకింప కలిగిన కవిరాజులకు వసంతం వచ్చేసిందన్న తలపు అదొక మధురోహగానే భాసించవచ్చు, సందేహం లేదు. కానీ ప్రతి విషయానికీ బొమ్మా, బొరుసూ అంటూ రెండు ముఖాలు వుండనే వుంటాయి, తప్పదు. ఇంతలోనే మళ్ళీ ఒక సంవత్సరం కాలగర్భములో కలిసిపోయిందన్న కటిక సత్యం ఊహకు తటినప్పుడు నడుస్తూ నడుస్తూ వున్న మానవుడు ముందుకు వేసిన అడుగు ముందుకు, వెనక్కు వేసిన అడుగు వెనక్కు అలాగే వుంచేసి కాసేపు స్తంభీభూతుడైపోతాడు.

నామటుకు నేను సంవత్సరానికొకసారి యిలా స్తంభీభూతుడినైపోవలసి వస్తున్నది. అందుకు కారణం మా నరసయ్య మామ ప్రశ్న!

"కొత్త పంచాంగాలొచ్చేశాయా బాబూ?"

నరసయ్య మామ అందుకని మా యింటికి రాడు. అతడిది బాటప్రక్కన భారీసేద్యం. ఆ బాటవెంబడే నరసయ్యమామ పొలాల్ని దాటుకుని, యింకొ రెండుమూడు ఫర్లాంగులు నడిస్తేగానీ నేను నా గమ్యస్థానాన్ని చేరుకోలేను. మానరసయ్యమామ పరిభాషలో నా యీ గమ్యస్థానానికి పలుకూటమని పేరు. పలుకూటంలో పలువురు పిల్లలతో పరివేష్ఠితుడినై కాలమొకరీతిగా నెళ్ళబుచ్చుతున్నందుకు ప్రతిఫలంగా నాకు నెలనెలకూ ఎంతోకొంత పైకం ముడుతున్నమాట నిజమే! కానైతే ఈ జీతంలో బడికి పోతూ, పోతూ నరసయ్యమామ ప్రశ్నలకు జవాబు చెబుతున్నందుకు ఎంతయిస్తున్నారో, 'ఊరుకోండర్రా వూరుకోండి, సైలన్స సైలెన్స్' అని గొంతు చించుకుంటూ కుర్రాళ్ళలో క్రమశిక్షణ నిరవాకంచేస్తున్నందుకు ఎంత యిస్తున్నారో, 'బాబ్బాబూ! ఈ ప్రోనోటు కాస్త వ్రాసేయండి' అంటూ ప్రాధేయపడ్డం మొదలు, 'సాయంత్రం మాయింటిదాకొవచ్చి పత్రాలు, దస్తావేజులుచూచిపోవలసినది' అంటూ కోర్టు సమ్మన్లులావచ్చిపైనబడే ఆజ్ఞలదాకా అన్నింటినీ శిరసావహిస్తున్నందుకుఎంతయిస్తున్నారో, కాగాపోగా పిల్లలకు పాఠాలు చెబుతున్నందుకు మాత్రం గిట్టుబాటవుతున్నదంతో నాకు తెలియదు.

ఈ కార్యకలాపాల్లోగూడా మిగిలినవన్నీ ఒక ఎత్తు. మా నరసయ్యమామ ప్రశ్నలకు జవాబుచెప్పడంమాత్రం ఒక ఎత్తు.

అసలు మానరసయ్యమామ ప్రశ్నావాహిని ఏనాడూ వట్టిపోని జీవనదిలాంటిది. భోజరాజును చూడగానే కవిత్వం పుట్టుకొచ్చినట్టు, దూరంనుంచీ నాముఖాన్ని చూడగానే అతడికి ఓ ప్రశ్న చటుక్కున స్ఫురించేస్తుంది.

## మధురాంతకం రాజారాం

ఈ ప్రశ్నల్లో రోజువారీ ప్రశ్నలు కొన్ని:
"ఈ రోజు రావుకాల మెప్పుడు బాబూ?"

పిలుపులూ, పేటాకులూ లేకపోయినా భోజనానికి ఆయత్తమైవచ్చి స్వయంగా తానే పీటవేసుకుని కూర్చునే అతిథిలాంటి పెద్దమనిషి ఈ రాహువు. గ్రహాలు తొమ్మిదని అనుకున్నతర్వాత వాటిలో రెంటికి మాత్రం బంతిలో ఎందుకు చోటు లేకపోవాలో మనకు తెలియదు. రాహువుకే గనుక ఒకరోజును ప్రత్యేకించివుంటే, ఆదివారానికి బదులు ఆ రాహువారాన్ని పబ్లిక్ హాలిడేగా పరిగణించి కాలు కదపకుండా అందరూ యిళ్ళల్లోనే కూర్చుని ఈగలు తోలుకోడానికి వీలుండేది! ఎంతో శిష్టులైతేగానీ, తమకు అన్యాయం జరిగినప్పుడు తిరగబడకుండా వుండలేరు. అందులోనూ రాహువు శిష్టగ్రహం కానేకాదు. దుష్టగ్రహం, పైగా వక్రగ్రహం. పంచాంగంలో అతడిది పంచమాంగదళంలాంటి వ్యవహారంగావుందంటే అందులో ఆశ్చర్యమేమీ లేదు.

ఉద్యోగంలోచేరి పేటకూ పల్లెకూ రాకపోకలు ప్రారంభించిన క్రొత్తలో ఓ రోజు వుదయం అడుసుదున్నుతున్న నరసయ్య మామ నన్ను చూడగానో నాగలి నిలిపి రావుకాల మెప్పుడని అడిగాడు. నాకప్పటికి మరచిపోయింది మరచిపోగా మిగిలివున్న వ్యాకరణ శాస్త్రవాసనవల భూతభవిష్యద్వర్తమాన కాలాల్ని గురించి కొంత తెలుసుగానీ రాహుకాలాన్ని గురించి బొత్తిగా తెలియదు.

'నేరనన్న వాడు నెరజాణ, నేర్తునన్న వాడు నిందజెందు' అన్నాడుగదా వేమన్న, అసమర్థతను ప్రకటించుకోడం ఉచితమైనప్పుడు, అజ్ఞతనుమాత్రం ఎందుకు ప్రకటించుకోగూడదు అనుకుని 'రాహుకాలమా! అబ్బే, నాకు తెలియదే!' అని తలవంచుకొని నా దోవంట నేను వెళ్ళిపోజూచాను.

"అయ్యో, అదేమిటి బాబూ! అలాగనే కావు!" అంటూ నావైపు ఆశ్చర్యంగా చూచాడు నరసయ్యమామ! "రావుకాలం పలానప్పుడు అని చెప్పడానికే బద్ధకమా! అయ్యో రామ! మీ తాతగారుండేవారు, పుణ్యాత్ములు గదటయ్యా! అడక్కపోయినా సరే, "ఒరే నరసయ్యా! ఈరోజమావాశ. పెద్దలకు ఓ విస్తరి వేయడానికి మరిచిపోయేవు" అని ఆయనే స్వయంగా చెప్పేవారు. ఆయన పోయారనుకో, మీ నాన్నగారు మాత్రం! తిథి వారం నక్షత్రం ఏదడిగితే అది టక్కుటక్కున చెప్పేసేవాడు గదటయ్యా..."

పెద్దల మంచితనం గూడా ఒక్కొక్కప్పుడు భావితరాల పిన్నలకు ఉపద్రవకరమేమో అనిపిస్తుంది. ఐనా మరేం పరవాలేదు. ఈ మాత్రం నిష్ఠూరంతో నరసయ్యమామ బారినుంచీ తప్పించుకోగలిగా నన్న తృప్తితో మౌనంగా వెళ్ళిపోయాను.

కానీ నిరసయ్య మామ నన్ను అంతటితో వదిలిపెట్టే ఘటమని భావించడంలో నేను ఘోరమైన భ్రమాప్రమాదానికి లోనయ్యానన్న విషయం నాకో మరునాటి ఉదయమే విశదమైంది.

"రావుకాల మెప్పుడని అడిగితే చెప్పకపోయావు. పోనీలే నాయనా! అంతలో వుంది. ఆ మనుషులా, ఆ కాలమా!" అంటూ విడివిడిగా మాటలు కొన్ని వల్లించి "అదిసరేగానీ ఈ రోజు ఏ ప్రక్క వారశూల?" అని

# ★ పంచాంగప్రసక్తి ★

ఒక సరిక్రొత్త ప్రశ్నను నాపైకి విసిరాడు నరసయ్య మామ.

వారశూల! కడుపు శూలతో బాధపడు తున్న వాళ్ళని కొంతమందిని నేనెరుగుదును. కడుపులో శూలంతీసుకుని కుమ్మినట్లుండటం చేత ఈ బాధకు కడుపుశూల అని పేరు పెట్టటం జరిగిందని కూడా ఎవరో వివరించారు. కానీ ఈ వారశూల వృత్తాంత మేమిటి? ఇది ఎవర్ని ఎక్కడ బాధిస్తుంది?

"వారశూలా నరసయ్య మామా! మరి... మరి..." అంటూ గుటకలు మింగసాగాను.

"అదీ తెలియదని చెప్పేద్దామని చూస్తున్నావల్లే వుంది. అంతేగదూ!" అన్నాడు నరసయ్య మామ.

"అహాఁ, అది కాదు. మరచిపోయినట్టున్నాను. జ్ఞాపకం చేసుకుని మధ్యాహ్నం చెబుతానులే" అంటూ వడివడిగా నడక సాగించాను.

మధ్యాహ్నం కావడానికి కొంతసేపు పడుతుంది? ఆ లోపల నేనీ వారశూలనుగురించి తెలుసుకోకతీరదు. మెల్లగా ప్రధానోపాధ్యాయుల్ని సమీపించి "అయ్యా! ఇవేమిటో రాహుకాలమనీ, వారశూలలనీ కొన్ని ఈతిబాధలు మానవజాతిని వేధిస్తున్నట్టు తెలియవచ్చింది. ఆయా విషయాల్నిగురించి తెలుసుకోడానికి నాకొక ఉద్గ్రంథాన్ని సూచించగలరా?" అని అతి వినయంగా ప్రాధేయపడ్డాను.

ఆయన ముసిముసి నవ్వులు వెదజల్లుతూ మొదటి తరగతి కుర్రాడి నొకణ్ణి కేకవేసి ఒక పుస్తకాన్ని తెప్పించి "చూశావయ్యా మేష్టారూ! ఇది పెద్దబాలశిక్ష! మొదట దీన్ని చదివి ఒంటబట్టించుకోవడం మంచిది. రాహుకాలం, వారశూలల్నిగురించిమాత్రమే గాక యింకా అనేక ముఖ్యవిషయాలిందులో వుంటాయి. 'పోయెను, వచ్చెను మొదలగు వ్యవహారంబులకు కారణంబైన భగవత్స్వరూపంబే కాలంబు. అట్టి కాలం బఖండంబైనను గ్రహరాశి నక్షత్రాద్యాత్మకంబై జ్యోతిశ్చక్రమునందు దిరుగుచున్న చంద్రసూర్యగతులబట్టి అఖండకాలమునందు ఖండకల్పనముచేసి జనులు వ్యవహారమును జరిగింతురు. ఇదంతా ఏదో పుబుసుపోకకు చెబుతున్నాననుకోకు. పంచాంగానికి సంబంధించిన ప్రాథమికవిషయాలు తెలియకపోతే పల్లెటూళ్ళో బడిపంతులుగా చెలామణీకావడం కష్టం. ఆ తరువాత నీ యిష్టం" అన్నారు.

ఎంత పని చేశావయ్యా నరసయ్య మామా అనుకుంటూ 'పాడ్యమి, విదియ, తదియ' అనుకుంటూ తిథుల్ని, 'మేషమూ, వృషభము' అనుకుంటూ రాశుల్ని, 'అశ్వనీ, భరణీ, కృత్తికా' అనుకుంటూ నక్షత్రాల పటికను అధ్యయనం చేశాను.

"అంగార పూర్వగమనేచ లాభం, సోమే శనీ దక్షిణ మర్థలాభం" అంటూ, ప్రయాణానికి అనుకూలవారాల్ని గురించి, "న పూర్వే శని సోమేచ, న గురుర్దక్షిణే తథా..." అంటూ ప్రయాణ నిషిద్ధ వారాల్ని గురించి శ్లోకాలు నోటిపాఠం చేసుకున్నాను.

నారికేళపాకంలోవున్న కవిత్వంలా మొదట మొదట అయోమయంగా కనిపించిన పంచాంగం, రానురానూ కొంచ కొంచెంగా అవగతం కాసాగింది.

కానీ పంచాంగం చూడానికి తెలియడం లేదు. ప్రతిరోజూ ఒక దినకృత్యంగా పెట్టుకుని 'ఈనాటి తిథేమిటి, నక్షత్రమేమిటి, యోగమేమిటి' అని తెలిసివుంచుకోడం వేరు!

బజారునుంచీ ఒక వస్తువు తెమ్మని ఒకసారికి బదులు నాలుగుసార్లు చెప్పినప్పటికీ మరచిపోయి రావడమే మామూలయినప్పుడు ఈతిథులూ గిథులూ, నక్షత్రాలు గిక్షత్రాలు మాత్రం ఎలా జ్ఞాపకముంటాయి?

కానీ నా సాధక బాధకాలతో నరసయ్య మామకు ప్రసక్తిలేదు. అతడికి కావలిసిందల్లా అతని ప్రశ్నకు జవాబు! పాడ్యమెప్పుడు? పంచమి వెళ్ళిపోయిందా? అమావాశ ఎప్పుడొస్తుంది?...

అనుభవానికి మించిన ఆచార్యుడు లేడన్నారు! కాలక్రమాన నేను మా నరసయ్య మామకు బదులివ్వడానికి ఒకటి రెండు సులభ పద్ధతుల్ని అన్వేషింపగలిగాను.

"పంచమా నరసయ్య మామా! నిన్న గాక మొన్న సెగదూ పున్నమి?..."

"పున్నమి ఆదివారంనాడు గదటయ్యా!"

"ఓ, అవునవును ఆది సోమ మంగళ బుధ.. ఈరోజు బుధవారం. రేపు గురువారం. అలాగైతే పంచమి రేపన్న మాట!"-ఇదీ మొదటి పద్ధతి!

"అమావాస్యా నరసయ్యమామా! మరి.." అని నేను కాసేపు ఆలోచనను అభినయించ గలిగితే చాలు, ఒకటి రెండు క్షణాలు తామసించి మా నరసయ్యమామే "ఆ నీలకంఠయ్యేమో చెప్పాడు. పైవచ్చే సోమవారమేననీ..." అని తనే సమాధానాన్ని సరఫరా చేసేసాడు.

"సోమవారమని చెప్పాడా! అవునవున్లే నరసయ్య మామా! సోమవారమే అమావాస్య!" అంటూ నేను ముక్తాయించేశానంటే అప్పటి కాగండం తప్పిపోయినట్టే!

నరసయ్యమామకు నాలాటివాళ్ళెంత మందిలేరు గనుక! అతడికప్పటికప్పుడు ఏదో ఒక పర్వదినాన్ని గురించి తెలుసుకోవలసిన అవసరం వుండనే వుంటుంది. దీపావళి పండుగ నవంబరు 27 వ తేదీన వస్తుందనుకోండి. ఆ రోజుకోసం నరసయ్య మామ ఎంతో ఆదుర్దాగా వేచివుంటాడు. ఆపండుగ


## తరచుగా మూత్రం వెలువడుచున్నదా?


చక్కెరతోగాని లేక చక్కెర లేకుండాగాని తరచుగా మూత్రము వెలువడుట మిక్కిలిప్రమాదకరమైన చిహ్నము. శరీరాన్ని గుల్లచేయడమే కాకుండా యీ వ్యాధి తనబంధంలో చిక్కిన వారిని ఆరోజుకారోజు మృత్యువుకు ఆసన్నుని చేయును. ప్రథమదశలో శారీరక మానసిక శ్రమలకు యిచ్చగించకుండుట, నడుములో నొప్పి, చూపు మాంద్యము, తొడల్లో తిమ్మిరి, నరముల బలహీనతతో యీ వ్యాధి పొడచూపును. పై లక్షణములతోకూడిన వ్యాధికి వెంటనే తగిన చికిత్స చేయించకున్నచో అధికదాహం, ఆకలి, గొంతు నోరు యెండుట, దురదలు, కాళ్ళలో పగుళ్ళ తూకంతగ్గడం, శరీరమంతా పోట్లు, కీళ్ల నొప్పులు, కంటిపొరలు, క్షయ, గడ్డలు రాచపుండ్లు, యిట్టి భయంకర బాధాకరమైన వ్యాధులు యెన్నో సంభవింపవచ్చును.

"వీనస్ ఛారమ్" మాత్రలు వాడి, అనేక వేల మంది తమబాధల నుండినివారణపొంది మృత్యుకరాళమునుండి రక్షింపబడిరి. "వీనస్ ఛారమ్" శాస్త్రీయ పద్ధతులమీద, ప్రాచీన యూనానివైద్య విధానప్రకారం అమూల్య ఓషధుల శాకపదార్థముల, ప్రాభావిత క్షారముల సారముతో తయారైనవి. మూత్రములో పంచదార, పలుమారు మూత్రవిసర్జనచేయు అవసరము 2 లేక 3 రోజులలోనే మీకు చాలాభాగము నివారణగును. కొద్ది రోజులలోనే మీకు పగానికిపైగా స్వస్థత చేకూరినట్లనిపించును. "వీనస్ ఛారమ్" కొద్ది వ్యయముతో, సుఖముగా, తేలికగా సేవించవచ్చును. దీనికి ప్రత్యేకపథ్యము లేదు నిరాహారముతో నుండే అవసరంలేదు. రోగులు పుష్టికరమైన ఆహారము తినేందుకై రోగులు యిదివరకటికంటే యెక్కువరకాల ఆహారపదార్థములు తీసికొనవచ్చును. వివరములు గల ఇంగ్లీషు కరపత్రములు అడిగినచో ఉచితముగా పంపబడును. ధర: 50 మాత్రల సీసా రు. 6-75 ప్యాకింగు పోస్టేజి ఉచితము.

లభించు స్థలము:

Venus Research Laboratory (A. P. W.

P. O. Box No. 587, Calcutta




# ఇంటింటి పంచాంగశ్రవణం

వి. వి. ఆచార్య, వల్లభాపురం

తీయటికలలావచ్చి అంతలోనే అంతర్ధానమై పోతుంది. అదలా వల్లిండ్లో కేదో 13వ తేదీ వుదయమే ప్రశ్నిస్తాడు నరసయ్యమామ—"సంక్రాంతి పండుగెప్పుడు బాబూ?" ఆ సంక్రాంతి పండుగ అరుమూరైనా, మూరుఅరైనా తన రివాజుప్రకారం జనవరి పద్నాలుగో తారీఖు నాటికి తప్పనిసరిగా వచ్చి హాజరుపలుకుతుంది. సంక్రాంతికి మరునాడు పశువుల పండుగ. ఆ మరునాడు పారువేట. పదిహేడో తేదీ వుదయానికల్లా నా కోసం మరొక ప్రశ్న సిద్ధంగా వుంటుంది: "కొత్త పంచాంగాలొచ్చేశాయా బాబూ?"

"కొత్త పంచాంగాలు రాకేం చేస్తాయి నరసయ్యమామా! తప్పకుండా వస్తాయి." అని నేను సమాధానమివ్వవలసివస్తుంది.

వెంటనే ప్రశ్నల పరంపర—.

"ఐతే ఆ సంక్రాంతి పురుషుడీసారి దేనిమైన ఎక్కాడు? ఏ దిక్కుగా వెళ్ళాడు? ఎలాటిబట్టకట్టుకున్నాడు? ఏంతిన్నాడు?.."

ఈ సంక్రాంతిపురుషుడెవడోగానీ, ఇతగాడు గుణగణాల్లో శనిగ్రహానికి ప్రాణమిత్రుడుగానూ, రాహుకేతువులకుతోడల్లుడులాగానూ ద్యోతకమౌతాడు. బహుశా ఇతడు పురాణాల్లో వికృతిస్వరూపులుగా వర్ణించబడిన రాక్షసులకు, కొన్ని కొన్ని జానపద చలనచిత్రాల్లో వరుల్ని అరచేతిలో నిలబెట్టుకునే భేతాళుడికు, గలివరు ప్రయాణించినవాడు దేశంలో కనిపించిన మహాకాయులకు మూలపురుషుడై వుంటాడు! ఇతడి ఆకారం అంత వికారం! "అష్టవక్త్రో విశాలాక్షో లంబభ్రూ దీర్ఘనాశికః—ద్విముఖం కృష్ణవర్ణంచ కురూపంచ త్రినేత్రకం...సప్తబాహుం, ద్విపాదంచ..." పనిలోపనిగా ఇతడిస్వరూపాన్ని చిత్రించదలచుకున్న చిత్రకారులకు ఒక చిన్నమనవి. స్కేలు విషయికంగా కొంత అప్రమత్తత అవసరం! ఏ నలభైమైళ్ళకొక అంగుళమని నిర్ధరించుకున్నప్పటికీ, ఈ ఆకారాన్ని చిత్రించడానికి యిరవై అంగుళాల పొడవున్న డ్రాయింగుపేపరు కావలసివస్తుంది. ఎందుకంటే ఈ సంక్రాంతిపురుషుడి ఎత్తు 800 మైళ్ళు. ఛాతీ చుట్టుకొలత 96 మైళ్ళు!

ఆకారం సంగతిలావుండగా ఇంచుమించుగా యితడి చేష్టలన్నీ అరిష్టసూచకాలు! ఎరుపురంగువస్త్రం కట్టుకున్నాడా, యుద్ధం తప్పదన్నమాటే! మెడలో పొగడ పువ్వుల దండ కైసేసికొన్నాడా, ఆకటిబాధలు చెప్పతరంగావు. వెండినగలు ధరించాడుబో, ఇక లోహాలకన్నింటికీ వినాశమే! ఎక్కింది వరాహమా, యిక వచ్చిందే వల్లజీవాలన్నింటికీ ముప్పు! ఇన్ని హంగులతో యితడేదిక్కుగా వెళ్తున్నాడో, ఆదిగ్భాగంలోవున్న దేశాల్లో క్షామం చెలరేగుతుంది. దారిద్ర్యదేవత విశృంఖలంగా వీరవిహారం చేస్తుంది. లేదూ, ఒక్కొక్కప్పుడు యిందుకు విరుద్ధంగా వర్షాలు బాగాపడినా పడవచ్చు. ఐతే అప్పుడది అతివృష్టిమాత్రమే అవుతుంది. జలోపద్రవాల్లో దేశం అతలాకుతలమైపోతుంది. రోగాలు విచ్చలవిడిగా వ్యాపిస్తాయి. మునపటికవనో భార్య భర్తను దెప్పినట్టుగా అది అతివృష్టిగానివ్వండి, అనావృష్టిగానివ్వండి ఎలాగైనా ముప్పుమాత్రం మనుషులకే!

యుద్ధాలకు, ఈతిబాధలకు లౌకిక కారణాలను వివరిస్తే మా నరసయ్యమామ వినిపించుకోడు. లోకంలోని సర్వానర్థాలకూ సంక్రాంతి పురుషుని లీలలే కారణమని అతడి అచంచల విశ్వాసం!

ఆ మాటకొస్తే మా నరసయ్యమామ పంచాంగాన్ని చింపి పోగులుపెట్టే, యిక నక్షత్రాలే లేవు పొమ్మంటే ఆమాట తిరుగులేని సత్యమని నమ్మేస్తాడు!

మా నరసయ్యమామ బహుకుటుంబీకుడు.

(55-వ పేజీ చూడండి)

# అతిథి సత్కారం

(37-వ పేజీ తరువాయి)

వారికి వండివార్చేందుకు" అంటుంది. పిలువక పోతే వచ్చినవారి దగ్గర పరువుపోతుంది. ఆడకతెరలో పోకచెక్కగా వుంటుంది వారి పని. మేకపోతు గాంభీర్యంతో ఎదటివారిని విందులకి పిలిచి, యింట్లో భార్యామణి కాళ్ళావేళ్ళా పడతారు మాట దక్కించమని. అప్పట్లో వచ్చిన వారి కెలాంటి మర్యాద జరుగుతుందో తేలికగా వూహించవచ్చు. ఇంటావిడ కొంచెం మెత్తనిదైతే, భర్త పరువు నిలువుతుంది. గయ్యాళియైతే నోటితోగాక చేతలతో తన అయిష్టాన్ని వ్యక్తీకరిస్తుంది. ఈ ముప్పు గడవాలంటే భార్యాభర్తలిరువురూ సంప్రదించుకొనిన మీదట ఎవరినైనా విందు కాహ్వానించటం మంచిది. సంప్రదింపులకి వ్యవధి లేనప్పుడు భర్త గౌరవం కాపాడటం భార్యవిధి.

మరికొన్ని యిళ్లలో యింటి కెవరైనా రావటమంటే గిట్టదు యజమానికి. ఈవిషయంలో స్వపర భేదమేమీ లేదు. తనూ, భార్యాబిడ్డలూ తప్ప మిగిలిన వారంతా పరులనే భావన. ఎవరైనా యింటికి వచ్చిన సూచన గ్రహించగానే ఘుమఘుమలాడుతూ అకారణంగా యింట్లో వాళ్లని విసుక్కోవటం, వచ్చినవారి ఎదుట అసభ్యంగా అరుస్తూ ప్రతివాళ్లనీ విసుక్కోవటం మొదలు పెడతారు. ఈ పరిస్థితులలో వచ్చిన వారికి ముళ్లమీద వున్నట్టుంటుంది. గృహిణిస్థితి వర్ణనాతీతం. అసలు ఇలాంటి యిళ్లలో స్వబుద్ధితో ఎవరినైనా ఆహ్వానించేంత దుస్సాహసం యిల్లాలి కుండదు. వచ్చేవారైనా ఏదో ముఖ్యమైన పనివుంటే తప్ప, కేవలం వీరింట్లో విందుభోజనాలు కుడుస్తూ కూర్చోవాలనే సదుద్దేశంతో రారు. అలాంటప్పుడు ఇంటావిడకు రాక రాక వచ్చిన అతిథికి అమర్యాద జరుగుతోందని బాధ—అలాంటి వ్యక్తియెదుట తను అవమానం పాలయ్యాననే వేదన. "మొగుడు కొట్టినందుకు కాదు, తోటికోడలు నవ్వినందు కేడ్పిం"దని మనలో ఒక సామెత వుంది. ఎవరూ లేనప్పుడు దేవుడులా వుండే భర్తయినా, ఎవరైనా వచ్చేప్పటికి విసుక్కోవటం తిట్టటం మొదలుపెడితే ఆ మంచి తనమేమీ రాణించదు. వీరెప్పుడూ యిలా కీచులాడుకుంటూనే వుంటారు కాబోలనుకుంటారు వచ్చినవారు. చాటుగా ఎన్ని మాటలైనా స్త్రీలు భరించగలరుగాని, యితరులఎదుట కొంచెం కఠోర పరిహాసాన్ని కూడా సహించలేరు. ఇక అవమానమే అయితే చెప్పాలా!

ఈ రకంలోనే గ్రుడ్డిలో మెల్ల అన్నట్టు కొందరు బయటివారి ఎదుట ఎంతో మర్యాదగా వుండి, ఆకోపమంతా చాటుగా అర్ధాంగి దగ్గిర ప్రదర్శిస్తుంటారు. "అవమైన వాళ్ళనీ ఎవరు మేపుతుంటారు! కాఫీ ఫలహారాలేమీ అక్కరలేదులే. అవసరమైతే హోటలుకి వెడతారు. భోజనం పెడితే చాలు. అదికూడా ఆట్టహాసమేమీ చేయకు" అంటారు. పాపం ఆవిడేం చేస్తుంది? భర్తమాట కాదంటుందా? దాని పర్యవసానమెలా వుంటుందో? లేక వచ్చిన వారిని అమర్యాద చేస్తుందా? వారికి సరియైన మర్యాద జరుగకపోతే "పాపం! మగవాడేమి చేస్తాడు? ఆలివిగాని ఆలిని కట్టుకుని అఘోరిస్తున్నాడు" అంటూ సానుభూతి వెల్లడిస్తారు. లోగుట్టు వారికేమి తెలుసు?

ఈ సమస్యకి రెండే పరిష్కారమార్గాలు. అందులో సులభమైనదీ అనుసరణీయమైనదీ యజమాని మనస్తత్వం మార్చుకోవటం. వచ్చేవారెవరైనా తప్పనిసరియై వస్తారేగాని కేవలం తనను వేధించే వుద్దేశంతో రారని గుర్తించాలి. బంధువులు ఇంట్లో వారి పరిస్థితి గ్రహించి, వారికి సాధ్యమైనంత దూరంలో వుండటం రెండవమార్గం. కాని ఈపద్ధతివలన క్రమేణా బంధుత్వాలే విచ్ఛిన్నమయ్యే ప్రమాదముంది. అయితే కానియ్య అనుకుంటే చిక్కేలేదు.

ఇక మూడవ రకం గృహస్థులు. వీరివద్ద ఆదరణకీ ఆప్యాయతకీ కొరత ఏమీ లేదు. కాగా ఒక్కొక్కప్పుడు శ్రుతిమించి బాధాజనకమౌతాయి. ఇంటికి వచ్చినవారు పని అయి వెళ్తామంటే, ఇంకా రెండు రోజులుండి వెళ్ళమని తగని బలవంతం చేస్తారు. వారు మొగమోటస్తులైతే అవతల అవసరమైన పనులెన్నో చెడిపోతాయి. త్రోసించి వెళ్ళిపోతే గేస్తుల సద్భావం కోల్పోతారు.

కొందరికి మర్యాద తెలియక మనవాళ్ళే కదా అని తాము ఏది తింటే అదే పెడతామనుకుంటారు. అంతమాత్రాన మనం చద్దిఅన్నం తింటాముగదా అని వారికీ అదే పెడితే ఏమి మర్యాదగా వుంటుంది? చాలా మిగిలితే పారేసుకుంటామా అనుకుంటారేమో? అక్కరలేదు. వెచ్చబెట్టి వాడుకోవచ్చు. చారు పులుసులాంటివి వేడిచేస్తే చెడిపోబోతున్నవి కూడా చెడకుండా వుంటాయి. అన్నం మళ్లీ పొయిమీద పెడితే చెడిపోతుందని భయంలేదు. పెద్దగిన్నెలో నీళ్లుపోసి అందులో అన్నపుగిన్నె పెట్టి మూతబెట్టి వేడిచేస్తే, అప్పుడు వండిన అన్నంలా వుంటుంది. పులిమజ్జిగ వాడవలసివస్తే, కొంచెం నిమ్మరసం, ఉప్పు, కరివేపాకు వేసే నోటికి రుచిగా వుంటుంది. ఇటువంటి వారి హృదయనైర్మల్యం వీరిలోపాలను కప్పివేస్తుంది.

మరికొందరు అజ్ఞానంచేతకానీ, తెలివితక్కువతనంవల్లకానీ, అతిథులని మాటలతో నొప్పిస్తారు. "ఈ పూట మీ వదిన గారింట్లో భోజనం కాబోలు" అనీ, "మీ మేనమామగారు మిమ్మల్ని భోజనానికి పిలవలేదా" అనీ ఇలా ఆ వూళ్లోనేవున్న ఇతర బంధువుల ఆహ్వానాలను గురించి సూచిస్తారు. తీరా వెళ్తామంటే "అయ్యో రాకరాక వచ్చారు. నాలుగు రోజులుండి వెళ్లండి" అంటారు. ఇంకా కొందరు ఇంటికి వచ్చిన వారితో "అంతా నాదగ్గిరనే వాళ్ళేకానీ, నన్ను పిలుచుకెళ్ళి నాలుగు రోజులపాటు పట్టెడు మెతుకులు పెట్టిన పాపానపోరు. అయ్యో! నిన్నంటున్నా ననుకుంటావేమో పిన్నీ, ఏదో మాటవరసకి చెప్పాను" అంటారు. వీరి మాటల వెనుక దాగివున్నది అజ్ఞానమో, వ్యంగ్యమో తెలుసుకోవటం బ్రహ్మతరం కాదు.

వంశగౌరవమనే పేరుతో అతిథిసత్కారం కోసం సర్వనాశనమయ్యే 'దూపాటి వియ్యన్నపంతులు' (పెళ్ళిచేసి చూడు)లాగా వుండమని ఎవరూ సలహా ఇవ్వరు. కానీ గృహస్థులన్న తరువాత అతిథి అభ్యాగతి సత్కారంచేయటం అవసరం. పూర్వకాలంలోవలె వారి పాదోదకం శిరస్సున చల్లుకోకపోయినా, వారికి భోజనపానీయాదులకు లోపం చేయకూడదు.

అంతా చెప్పిన తరువాత బాధాకరంగా తయారయే బంధుమిత్రులను కూడా ఒకసారి స్మరించటం అవసరం. వీరు "చుట్టమై వచ్చి దయ్యమై పట్టె" ననే సామెతను సార్థకపరుస్తారు. వీరు కేవలం భోజనపానాదులతో తృప్తిపడక గృహవిషయాలలో కూడా అనవసరంగా జోక్యం కలిగించుకుంటారు. భార్యాభర్తలమధ్య మనస్పర్థలు కలిగించటం, లేకపోతే వారిని దద్దమ్మలనుచేసి గృహనిర్వహణాధికారాన్నే హస్తగతం చేసుకొని శ్రేయోభిలాషులవలె నటించటంవంటి దారుణాలెన్నో చేస్తారు. ఈ విధమైన అతిథులకి కూడా వారికి తగిన సత్కారం చేయటం అవసరమే. ★

# పంచాంగ ప్రసక్తి

(19 వ పేజీ తరువాయి)

గవర్నమెంటువారు చౌక దుకాణాలు తెరిచిన రోజుల్లో అతడిది నలభైవీసు యూనిట్ల రేషను కార్డు. ఐదుగురు కొడుకులు, ముగ్గురు కూతుళ్లు పెళ్ళిళ్లయి కాపురాలు చేసుకుంటున్నారు. కోడళ్ళను పుట్టింటినుంచీ తీసుకరావడమో, కూతుళ్ళకు సారె పెట్టి అత్తగారింటికి పంపడమో నెలకు రెండు మూడు ప్రయాణావసరాలుంటాయి. మునసబుగారి జనన మరణ రిజిష్టరులో అతడికి ఏడాదికి

# పంచాంగ ప్రసక్తి

ఏ నాలుగైదు పార్లయినా పని తగులుతుంది. చిన్నా పెద్దా, ఆడా మగా, పిల్లా జెల్లా క్రిక్కిరిసి వున్న సమిష్టి కుటుంబంలో అప్పుడప్పుడూ యిలాంటి వేవో జరగడంలో విడ్డూరం లేదు. ఉన్నట్టుండి ఒక శుభోదయాన నరసయ్యమామ నన్ను నడిరోడ్డులో నిలవేసి "నిన్న సాయంత్రం మా వారిగాడి పెళ్లాం నీళ్లాడింది" అంటాడు. ఇక అప్పటి నుంచీ నా అవస్థలు ప్రారంభం! జన్మకాలాన్ని గుర్తించాలి. నక్షత్రాన్ని బట్టి ఆ పుట్టిన బిడ్డకొక పేరు సూచించాలి. ఉండి వుండి ఒక ఆడబిడ్డ 'శ్రవణం'లో జన్మిస్తుంది. 'జూ, జే, జో, ఖా—శ్రవణం' ఆలోచించగా ఆలోచించగా 'జూ'కు జూలియా, 'జే'కు జేన్ ఆస్టిన్, 'జో'కు జోన్ ఆఫ్ ఆర్క్ యిలాంటి నామధేయాలు కొన్ని నాకు స్ఫురిస్తాయి. ఇలాంటి పేర్లు మా నరసయ్య మామకు నచ్చవని ప్రత్యేకించి చెప్పడం అనవసరం! ఏదో గంతకు తగిన బొంతగా ఒక మామూలు పేరు సూచించమని అతడు నా దుంప తెంచడానికి ఉద్యుక్తుడౌతాడు. పదేళ్లు దాటిన కుర్రదాన్ని, పదహారేళ్ళ కుర్రవాణ్ణి వివాహోచిత వయస్కులుగా పరిగణించేస్తాడు నరసయ్య మామ. వరులకోసం వధువులకోసం అన్వేషణ ముమ్మరంగా కొనసాగుతుంది. జాతకాలు కుదరాలి. పేరు పొంతనాలు సరిపడాలి. ఆ తరువాత ముహూర్తం నిశ్చయించుకోడానికొక మంచిరోజు చూడాలి...

ఎలాగైనా ఈ గొడవను వదలించుకోదలచి నాకూ అతడికీ కూడా తీరిక దొరికినప్పుడు నేను మెల్లమెల్లగా కొస్తా శుక్రనీతిని ఏకరువు పెట్టడంకద్దు: 'సత్యం వద' అని పురాణాలన్నీ ముక్తకంఠంతో వాకొంటున్నప్పటికీ 'వారిజాక్షులందు, వైవాహికములందు' అవసరాన్ని బట్టి నియమాన్ని అతిక్రమిస్తే ఫరవాలేదన్నారు పెద్దలు! పెళ్ళి సీమంతం, నామకరణంలాంటి శుభకార్యాలు జరపడంలో పంచాంగాన్ని పాటించడం అవసరమే! కానీ ఊరగాయలు వేయటం మొదలు, వూరికి వెళ్లడందాకా అంతకూ యింతకూ పంచాంగాన్ని పటుక మల్లాడడం అవివేకమే అవుతుంది. సాహేబులున్నారు. వాళ్లి పెళ్ళిళ్ళకు శుక్రవారం మధ్యాహ్నం పదకొండు గంటలకు సరిగ్గా ముహూర్తం కుదురుతుంది. అంటే మంచి రాహుకాలమన్నమాట! వాళ్ళేం చెడిపోయారు? ముగాలీలనీ, పిచ్చికుంటలవాళ్లనీ, దాసర్లనీ పొట్ట చేతబట్టుకుని దేశంపైన తిరిగే జాతులు వెయ్యివున్నాయి. 'మాకుగాదులు లేవు, మాకుషస్సులు లేవు' అన్నట్టుగా వాళ్లకు జాతకర్మలూ లేవు, జాతకాలూ లేవు. వాళ్లలో వివాహాలు చెట్టుక్రింద, పుట్టప్రక్కన పుట్టు దప్పుడుగా జరిగిపోతాయి. అలాగని వాళ్లి దాంపత్యజీవితం ఆనందకరంగా గడవడం లేదని ఎవరు చెప్పగలరు? ఏవో కొన్ని విశ్వాసాలు మానవుడికవసరమేగానీ, హద్దు మీరినప్పుడు ఎంత మంచి విశ్వాసమైనా చాదస్తమనిపించుకుంటుంది...

రామాయణమంతా విని సీతకు రాముడేం కావాలని ప్రశ్నించినట్టుగా "నీ మాటలకేం లేవయ్యా! దొంగతనానికి కూడా మంచి ముహూర్తం చూచుకుని బయల్దేరమన్నారు. అది సరేగానీ రేపు మడికి నారుపోయాలి. మంచి రోజేనేమో చూడు!" అంటాడు నరసయ్యమామ.

ఒక్క నారు పోయడానికి మాత్రమేమిటి, చెరకు నాటటానికి, గానుగ తిప్పడానికి తమలపాకుల తోటలో తీగ దించడానికి యిలాంటి వన్నింటికీ మంచి రోజే కుదరాలి నరసయ్య మామకు!

బండలుపగిలే భరణికార్తి, రోళ్ళుపగిలే రోహిణికార్తి వెళ్ళిపోగానే మా నరసయ్య మామ మోర పైకెత్తి ఆకసంవైపు చూస్తూ వుండిపోతాడు. చినుకు నేలపైనపడి, 'ఆరుద్దుల' కార్తిలో గింజ భూమిలో పడితేగానీ అతడి ప్రాణాలు కుదుటపడవు. కానీ ఋతుధర్మాలు ఋతు వర్ణనల్లో కనిపించినంత సక్రమంగా లోకంలో ప్రవర్తిల్లడం లేదు. 'అంతర్విగర్జన్మహాంభోధరమ్ములు, నీల నమ్ర స్నిగ్ధ నీరదములు' ఒక్కొక్కప్పుడు వర్షఋతువంతా వేచిచూచినా కనిపించవు. జల్లు జల్లుమని కురిసే జడివాన మ్రోత జలజాక్షి కాలిగజ్జల చప్పుడుగా, హోరు హోరున వీచే సుడిగాలిమ్రోత వెలది యాలాపించు రాగమాలికగా, వెయ్యి ఒయ్యారాల వర్షలక్ష్మి విశ్వరంగంపైన నృత్య మొనర్చిన దృశ్యం స్వప్నసదృశంగా మాత్రమే మిగిలిపోయి, ఉత్తర కార్తిదాకా నేల చిత్తడిగాక, వర్షఋతువు సైతం నిదాఘాన్నే తలపించే గడ్డురోజుల్లో "ఈ కార్తిలోకూడా వానయోగం' లేదా బాబూ?" అనిదీనంగా ప్రశ్నిస్తాడు నరసయ్యమామ!

అప్పుడు నేను మా నరసయ్యమామకు కాస్తా భూగోళ శాస్త్రం కూడా బోధించడం కద్దు:

"వానయోగానికేం నరసయ్యమామా! పంచాంగంలో ప్రతి కార్తికీ ఎదురుగా అతివృష్టిఅనో, సర్వత్ర వృష్టి అనో, ఏదో ఒక వివరం వ్రాయబడి వుంటుంది. కానీ పంచాంగకర్త పీఠికలోనే 'ఈ సంవత్సరం మేఘ పాలకుడు ఫలానావాడు కావటంవల్ల ఖండవృష్టి కురియును' అని వుదహరించి వుంటాడు. ఖండవృష్టి అంటే ఏమిటి? వర్షం ఎక్కడో ఒకచోట పడుతుంది. మిగిలినచోట్ల పడదు.

ఆఫ్రికాఖండంలో సహారా అన్న పేరుతో ఒక పెద్ద ఎడారి వుంది. అక్కడ సంవత్సరానికంతా ఒకటి రెండు పదున్ల వాన పడితే బ్రహ్మాండం. మనదేశంలో చిరపూంజి అన్న ప్రదేశముంది. అక్కడ ఏడాదిపొడుగునా సరాసరి రోజుకొక్క పదును వాన కురుస్తుంది. అంతెందుకు? మన తెలుగుదేశంలోనే ఒక వైపున వరదల్లో దేశం మునిగిపోతుంటే, మరొకవైపున క్షామరాక్షసి బీభత్సం కనిపిస్తుంది. అమాటకొస్తే వర్షం కురవడానికి గానీ కురవక పోవడానికిగానీ కారణం ఋతుపవనాలు. ఇవి నైర్‌ఋతి ఋతుపవనాలనీ, ఈశాన్య ఋతుపవనాలనీ రెండు విధాలు. పడమటి కనుమలు అడ్డుతగలడం వల్ల నైర్‌ఋతి ఋతుపవనాలు, తూర్పు కనుమలు అడ్డు తగలడంవల్ల ఈశాన్య ఋతుపవనాలు మనకు వర్షాన్ని చాలినంతగా ప్రసాదించడం లేదు..."

నిజానికింతదూరం నా ప్రసంగం సాగడానికి వీలుండదు. మధ్యలో ఎక్కడో అడ్డుతగిలి "ఇదేం గొడవనాయనా! వన్నెగతాళి చేస్తున్నావేమిటి?" అంటాడు నరసయ్యమామ.

యథార్థాన్ని ఎగతాళిక్రింద లెక్కగట్టే నరసయ్య మామ ఎదుట అప్పుడు నేను ప్రకాశంగా కాస్తా ఊహాగానం సలుపవలసి వస్తుంది!

'వెన్నెల కొన్నాళ్ళు, చీకటి కొన్నాళ్లు గదా నరసయ్య మామా! గడచిందంతా చీకటేననుకో, రాబోతున్నదే వెన్నెల! వానకోసం అర్రులు చాచుకుని మింటివైపు చూస్తూ కూర్చునేరోజులు గతించాయి. వర్షంతో ప్రమేయంలేకుండా పైర్లు పండించుకోడానికి వీలుగా ప్రాజెక్టులు నిర్మాణమౌతున్నాయి. గొట్టపు బావులద్వారా పాతాళగంగ పైకి పెల్లుబుకుతోంది. అంతేగాదు. కృత్రిమంగా ఎప్పుడంటే అప్పుడు, ఎక్కడంటే అక్కడ వర్షం కురిపించడానికి కూడా ఉపాయాల్ని అన్వేషిస్తున్నారు. నువ్వు నీ అరవయ్యేళ్ళ పైచిలుకు వయస్సులో రేడియో చూచావు, బయస్కోపు చూచావు. అవసరమైనప్పుడు ఓ బిస త్రిప్పగానే నీ పొలంలో ఒక పదును వాన కురిసేరోజులుగూడా నీ కళ్లముందరే రావచ్చు. ఏం, ఎందుకు రాగూడదు?..."

కరువు కాటకాలకు మా రొడ్డి భూమి తల్లితో పోరాడుతున్న తరతరాల వ్యవసాయ జీవనానికి ప్రతినిధిగా—మా నరసయ్య మామ నా మాటల్ని వింటూ వింటూ చల్లగా నవ్వుకుంటాడు. చెట్టుపైవున్న వెలగకాయను చూపించినప్పుడు ఏడుస్తున్న బిడ్డ పెదవులపైన విరిసే నవ్వు సరిగ్గా యిలాటిదేనేమో! ★

Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd., by S. Radha Krishna at
The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras-1. Editor S. Sambhu Prasad